వినియోగదారుల చేతికి బ్రహ్మాస్త్రం

వినియోగదారుల రక్షణ చట్టాన్ని మరింత పటిష్టంగా మార్చింది రాష్ట్ర ప్రభుత్వం. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని ఆయా విభాగాలకు ఫిర్యాదుల కోసం వివిధ టోల్ ఫ్రీ నంబర్లను కేటాయించారు. అయితే మోసపోయిన సమయంలో ఏ నంబర్ ఎవరి పరిధిలోకి వస్తుందో తెలియక కొనుగోలుదారులు ఫిర్యాదు చేసేందుకు అవస్థలు పడేవారు. దీన్ని గమనించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాటన్నింటినీ కలిపి ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ట్రోల్ ఫ్రీ నంబర్ 1967 ఏకైక నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో బాధితులు ఈ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే పరిష్కారం లభిస్తుంది.

- పౌర సరఫరా, తూనికలు, కొలతలు శాఖల్లో మోసాలకు చెక్
- ఫిర్యాదులకు ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్
- టోల్ ఫ్రీ నంబర్ 1967 అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం
- పటిష్టంగా వినియోగదారుల రక్షణ చట్టం

నంద్యాల: గుండు సూది నుంచి గూగుల్ సేవల వరకు, పాల నుంచి ఫార్మా కంపెనీల కల్తీ వరకు, రియల్ ఎస్టేట్ మోసాల నుంచి కార్పొరేట్, ఈకామర్స్ సంస్థల దోపిడీ వరకు ఎక్కడైనా సేవల్లో మోసం జరిగినా, వస్తువుల్లో నాణ్యత లోపించినా వినియోగదారులు ఏమీ చేయలేని పరిస్థితి. అలాంటి వారి చేతికి రాష్ట్ర ప్రభుత్వం బ్రహ్మాస్త్రం అందజేసింది. ఫిర్యాదులు, వినతులు, సలహాల కోసం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. టోల్ ఫ్రీ 1967 నంబరును రాష్ట్ర పౌర సరఫరాల కార్యాలయంలో అందుబాటులో ఉంచింది. గతంలో రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయంలో ప్రజలు, వినియోగదారులు, ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఎదుర్కొనే వారి సమస్యలను పరిష్కరించేందుకు వివిధ టోల్‌ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉండేవి. ఇందులో పౌరసరఫరాల శాఖకు సంబంధించి 18004250082/1967 టోల్ ఫ్రీ నంబరుకు, ఒకే దేశం ఒకే రేషన్ ఫిర్యాదులకు 18004253157/14445 టోల్‌ఫ్రీ నంబరు, రాష్ట్ర ఆహార భద్రత ఫిర్యాదులు, సలహాలు, సూచనలకు 18004252388/155235 టోల్‌ఫ్రీ నంబరు, తూనికలు, కొలతల శాఖకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 18004254205 టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులో ఉండేవి. దీంతో ఫిర్యాదులు ఒకరికి చేయడానికి బదులు మరో శాఖకు వెళ్లేవి. అంతేగాక వినియోగదారులు అన్ని నంబర్లను గుర్తుంచుకోవడం కష్టంగా ఉండేది. దీంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అన్ని టోల్‌ఫ్రీ నంబర్లను అనుసంధానం చేస్తూ 1967 నంబరుతో విజయవాడలో ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

అన్ని రకాల ఫిర్యాదులు చేయవచ్చు..

ఈ కాల్ సెంటర్‌కు ప్రజలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాల శాఖకు సంబంధించిన అన్ని రకాల ఫిర్యాదులు చేయవచ్చు. ముఖ్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో తూకాల్లో మోసాలు, అధికంగా డబ్బులు తీసుకోవడం, ధాన్యం సేకరణ, గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్ బంకులు, తూనికల కొలతల అవకతవకలపై ఫిర్యాదులు చేయవచ్చు. అలాగే సలహాలు, సూచనలు ఇవ్వవచ్చు. చేసిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పరిష్కారం నిమిత్తం పంపుతారు. అంతేగాక నిర్దేశించిన సమయం తర్వాత ఫిర్యాదు ఏ దశలో ఉందో, ఎవరి వద్ద పెండింగ్‌లో ఉందో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది.

ప్రజా పంపిణీ వ్యవస్థకు టోల్‌ఫ్రీ నంబర్



ప్రజా పంపిణీ వ్యవస్థ, ధాన్యం కొనుగోలుకు సంబంధించి సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ టోల్‌ఫ్రీ నంబరు 1967ను ఏర్పాటు చేసింది. దీని ద్వారా వినియోగదారుల రక్షణ చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని నిర్ణయించింది. ఈ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ 1967ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 6 గంటల వరకు కాల్ సెంటర్ అందుబాటులో ఉంటుంది.

– శ్రీనివాసులు, ఆర్‌డీఓ, నంద్యాల



తూకం వేస్తున్న దృశ్యం

చలివేంద్రం ప్రారంభం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని నాల్గవ వార్డు కౌన్సిలర్ తబ్రేజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ దాహంతో ఉన్న వారికి స్వచ్ఛమైన చల్లని మంచినీటితో పాటు మజ్జిగ, జ్యూస్‌ను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్‌సమ్మద్, కో ఆప్షన్ మెంబర్ పడకండ్ల సుబ్రహ్మణ్యం, నాయకులు బింగుమళ్ల శ్యాంసుందర్‌గుప్త, చిన్నరామయ్య, తిరువీధి సురేష్, వేణుగోపాల్, పానిపట్టి గౌండా రసూల్ పాల్గొన్నారు.

దొర్నిపాడు: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్‌ఐ తిరుపాల్ శనివారం ప్రారంభించారు. కువైట్‌లో ఉంటున్న హసన్ సహకారంతో హసన్ సేవ యూత్ సభ్యులు సత్యం, మహేష్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మంచినీటితో పాటు మజ్జిగ అందజేయడం అభినందనీయమన్నారు.

సచివాలయ సిబ్బందిపై కలెక్టర్‌కు నివేదిక

నంద్యాల(సిటీ): సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో వెనుకబడిన పట్టణంలోని సచివాలయ సిబ్బందిపై నివేదికను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని మున్సిపల్ కార్యాలయ అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 9న సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలని వెల్ఫేర్ సెక్రటరీలు, మహిళాపోలీసు, ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, అమెనిటీస్, హెల్త్ సెక్రటరీలను కలెక్టర్ ఆదేశించారన్నారు. అయితే లక్ష్య సాధనలో వెనుకబడిన వారిపై సీసీఏ రూల్స్ మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సిఫారసు చేస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : మండలంలోని అర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన శ్రీ అభయాంజనేయ స్వామి, లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఏకాదశి పర్వదినం కావడంతో ఆయా గ్రామాల్లో భక్తులు ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని కుంకుమార్చన, ఆకుపూజ, అభిషేకాలు చేశారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉపాధ్యాయులను నియమించాలి



మాట్లాడుతున్న సురేష్‌కుమార్

గోస్పాడు: పదోన్నతులు తర్వాత ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిన బడులకు ఉపాధ్యాయులను నియమించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేష్‌కుమార్ కోరారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 1998 డీఎస్సీ క్వాలిఫైడ్స్‌ను ఉపాధ్యాయులుగా నియమించనున్న నేపథ్యంలో ఏకోపాధ్యాయ పాఠశాలలకు అదనపు ఉపాధ్యాయులను కేటాయించాన్నారు. కావున కొత్తగా నియమించే ఉపాధ్యాయులతో ఏకోపాధ్యాయ పాఠశాలలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పీఆర్‌టీయూ నాయకులు విజయరావు, శంకరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరిగా పాటించాలి



కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీపీఓ శ్రీనివాసులు

దొర్నిపాడు: పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనంలో నిర్వాహకులు తప్పనిసరిగా మెనూ పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసులు సూచించారు. గురువారం ఆయన మండలంలోని చాకరాజు వేముల, డబ్ల్యూ గోవిందిన్నె, అమ్మిరెడ్డి నగరం గ్రామాల్లోని పాఠశాలలను తనిఖీ చేశారు. ముఖ్యంగా కస్తూర్బా విద్యాలయంలో చదివే పదో తరగతి విద్యార్థులకు విద్యుత్ సమస్య లేకుండా చూసుకోవాలని చెప్పారు. మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులు, పాఠశాలకు పేరు తీసుకు రావాలని విద్యార్థులు సూచించారు. ఆహారం కలుషితం కాకుండా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ నాగఅనసూయ, ఎస్‌ఓ జ్యోతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉశేని పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ వెలగలపల్లె పొలిమేరలో వెలసిన వాసాపురం వేంకటేశ్వర స్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు చేపట్టారు. అనంతరం పట్టువస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. స్థానికులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు క్యూలైన్‌లో వేచి ఉండి స్వామి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కులమతాలకు అతీతంగా శిల్పా సేవా సమితి సేవలు



మహిళకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, నాగినిరెడ్డి

నంద్యాల(అర్బన్): రాజకీయాలు, కులమతాలకు అతీతంగా శిల్పా సేవా సమితి ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం 136 మంది మహిళలకు రూ.16.46 లక్షల రుణాల చెక్కులను బ్యాంకు చైర్‌పర్సన్ నాగినిరెడ్డితో కలిసి అందజేశారు. బ్యాంకు డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీల పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో వసతుల పరిశీలన



యర్రగుంట్లలోనున్న కాలనీని సందర్శించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్

శిరివెళ్ల: యర్రగుంట్ల, వనికినిదిన్నె గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్ పర్యటించారు. ఈ సందర్భంగా యర్రగుంట్ల జగనన్న కాలనీలో లబ్ధిదారులకు తాగునీరు, విద్యుత్ సదుపాయాలను ఏఈ అహమ్మద్‌బాషాను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో మంచినీటి బోరు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేశారని ఎస్ఈ చెప్పారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు, నాడు–నేడు పనులను పరిశీలించారు. మెనూ ప్రకారం వడ్డించాలని ఏజెన్సీలకు సూచించారు. మొదటి విడత మన బడి నాడు–నేడు పాఠశాలకు అందజేసిన అగ్నిప్రమాదాల నివారణ పరికరాలను, లెట్రిన్ రన్నింగ్ వాటర్‌ను పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామచంద్రాచారి, హెచ్ఎం విజయకుమార్, సీఆర్‌పీ గుర్రప్ప పాల్గొన్నారు.

గర్భిణులు పరీక్షలు చేయించుకోవాలి

గోస్పాడు: గర్భిణులు ప్రతి నెల ఆరోగ్య పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలని గోస్పాడు వైద్యాధికారి కాంతరావునాయక్ తెలిపారు. మండలంలోని హెచ్ఎస్ కొట్టాల గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణిగా నిర్ధారణ అయిన వెంటనే స్థానిక ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించి మాతా–శిశు సంరక్షణ రికార్డులో వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు.16 వారాల వరకు వైద్యుల సలహా మేరకు రోజూ ఓ ఫోలిక్ యాసిడ్ మాత్ర వేసుకోవాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



హాల్‌టికెట్ నంబర్లను పరిశీలిస్తున్న పరీక్షల చీఫ్ రాజు

రుద్రవరం: ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని చీఫ్ శ్రీనివాసులు,డిపార్టుమెంట్ అధికారి జాఫర్ తెలిపారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వారు మాట్లాడుతూ మండలంలో 400 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, ఇందుకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ,తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ప్రకటించారన్నారు. అయితే మోడల్ స్కూల్‌లో ఇదివరకే ఏర్పాట్లు పూర్తి చేయగా, జెడ్పీ ఉన్నత పాఠశాలలో టేబుళ్ల సమస్య ఉండటంతో శనివారం కేజీబీవీ నుంచి టేబుళ్లను తరలించి గదుల్లో వేయించామని చెప్పారు. మొత్తం ఏడు గదులను సిద్ధం చేసి ప్రతి గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు పరీక్ష సమయంలో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించినట్లు వివరించారు.

దొర్నిపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల చీఫ్ రాజు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ భాగ్యనగరం, దొర్నిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, అమ్మిరెడ్డినగరంలోని కస్తూర్బా పాఠశాలల నుంచి మొత్తం 218 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని చెప్పారు. ఇందుకు 11 తరగతి గదులు, బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. డబ్ల్యూ కొత్తపల్లెలో చదివే 34 మంది విద్యార్థులు గోస్పాడు మండలం యళ్లూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాస్తారని పేర్కొన్నారు. పరీక్షలకు 12 మంది ఇన్విజిలేటర్లను నియమించారని, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా సౌకర్యాలు కల్పించామని వివరించారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా శ్రీనివాసులు రెడ్డిని నియమించినట్లు చెప్పారు.

పకడ్బందీగా ‘పది’ పరీక్షలు



ఉయ్యాలవాడలో ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇస్తున్న చీఫ్ డిపార్ట్‌మెంటల్ అధికారి

ఉయ్యాలవాడ : పదో తరగతి పరీక్షలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానం మేరకు పకడ్బందీగా నిర్వహించేందుకు ఇన్విజిలేటర్లకు స్థానిక మోడల్ స్కూల్‌లో శనివారం చీఫ్ డిపార్ట్‌మెంట్ అధికారులు నూర్జహాన్, సుధాకర్ శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మండలంలోని మాయలూరు, బోడెమ్మనూరు, హరివరం, కస్తూర్బా, స్థానిక మోడల్‌స్కూల్, జెడ్పీ ఉన్నత పాఠశాల, అలాగే సంజామల మండలంలోని నొస్సం, కోవెలకుంట్ల మండలంలోని గుళ్లదుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి స్థానిక పరీక్ష కేంద్రాల్లో 303 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. వీరి కోసం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 7 గదులు, మోడల్‌స్కూల్‌లో 9 గదులు కేటాయించామని, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

పార్కింగ్ వేలంలో మున్సిపాలిటీకి ఆదాయం

సాక్షి ఎఫెక్ట్

నంద్యాల(సిటీ): మున్సిపల్ అధికారులు పాత ధరలకు వేలాలు కట్టబెడుతున్నారనే విమర్శలపై శనివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారుల నుంచి స్పందన లభించింది. ఈ మేరకు శనివారం జరిగిన సైకిల్‌స్టాండ్ పార్కింగ్‌కు గతేడాది ధర కంటే రెండింతలకు పైగా రూ.1,35,000 పలకడం గమనార్హం. గత సంవత్సరం సైకిల్ స్టాండ్ పార్కింగ్ రూ.50 వేలకు పోయింది. దీంతో ఈ ఏడాది కూడా అదే ధరకు కట్టబెట్టాలని అధికారులు నిర్ణయించారనే వార్తల నేపథ్యంలో విమర్శలు జోరందుకోవడంతో నేడు జరిగిన వేలంలో పార్కింగ్‌కు ఏకంగా రూ.1.35 లక్షలకు కాంట్రాక్టర్ దక్కించుకోవడంతో.. అధికారులు వేలాలను సక్రమంగా నిర్వహించడంలో విఫలమయ్యారనేది నిజమైందని తేటతెల్లమైంది. ఇదే విధంగా పశువుల సంతను సక్రమంగా వేలం నిర్వహించి ఉంటే మున్సిపాలిటీకి మరింత ఆదాయం సమకూరేదని పలువురు పేర్కొంటున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో నిర్వహించిన సైకిల్ స్టాండ్ పార్కింగ్ వేలానికి నలుగురు వ్యక్తులు పోటీ పడగా జాకీర్ హుసేన్ రూ.1.35 లక్షలకు దక్కించుకున్నారని రెవెన్యూ అధికారి వరప్రసాదు తెలిపారు.

మార్కెట్ గేట్ వేలం మరోసారి వాయిదా..

మున్సిపాలిటీ అధిక ఆదాయం సమకూర్చే వనరుల్లో ప్రధాన మార్కెట్ కూడా కీలకమైనది. మార్కెట్ నుంచి గతేడాది రూ.83,98,000 మున్సిపాలిటీకి ఆదాయం రాగా ఈ సంవత్సరం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని కొందరు వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే మార్కెట్ గేట్‌లకు సంబంధించి ముచ్చటగా మూడోసారి వేలాలను వాయిదా వేశారు. ఈనెల 1న మరోమారు వేలం నిర్వహించనున్నట్లు రెవెన్యూ అధికారి వరప్రసాద్ తెలిపారు. ఇలా ఒక ఆర్థిక సంవత్సరం మొదలైన తర్వాత వేలం నిర్వహించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం ఎమ్మెల్సీ ఎన్నికలను బూచిగా చూపి వేలాలను వాయిదా వేస్తూ ధర తగ్గించే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలున్నాయి.

పథకాల గురించి ప్రజలకు వివరించాలి



సమావేశానికి హాజరైన సచివాలయ, మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు,



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

- గృహ సారథుల సమావేశంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి సూచించారు. శనివారం వైఎస్సార్‌సీపీ స్థానిక పార్టీ కార్యాలయంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో ‘మా నమ్మకం నువ్వే జగనన్న’ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పథకాలను అర్హులకు అందజేయడంలో పారదర్శకంగా వ్యవహరించామని, అందుకే ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్దామన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచామని, అర్హత ఉన్న ప్రతి ఇంటికీ పథకాలను అందించామని చెప్పారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందిన తీరును వివరించాలని సూచించారు. అలాగే అర్హత ఉండి పథకం రాకపోతే ఎందుకు రాలేదో? ఎప్పుడు వస్తుందో? వారు సంతృప్తి చెందేలా వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్న ప్రభుత్వాన్ని తీసుకొచ్చేలా కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వంలో ఎలాంటి పథకాలు అందాయి? ఇప్పుడు మనం అందజేస్తున్న పథకాలు.. పాలన తేడాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. టీడీపీ వారి లాగా మనం అబద్దాలు చెప్పలేదని, సంక్షేమం అంటే ఏంటో చేసి చూపించామనేది మరో సారి గడప గడపకు వెళ్లి వారికి వివరించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అలాగే పథకాల లబ్ధిదారుల ఇంటి వద్ద స్టిక్కర్స్‌ను అతికించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు గజ్జల రాఘవేంద్రారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నాయక్ వసీం, భాగ్యమ్మ, మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, బాబులాల్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ

నంద్యాల(సిటీ): విద్యార్థులు పరీక్షలకు భయపడి ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ తెలిపారు. శనివారం స్థానిక ఎస్పీజీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే మన లక్ష్యాలు ఉన్నతంగా ఉండాలన్నారు. ఏదైనా కార్యం మొదలు పెట్టే ముందు మన వల్ల కాదని అనుకుంటామో.. అప్పుడే మనం ఓటమి పాలైనట్టన్నారు. పరీక్షలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

4న చాగంటి ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): శ్రీమద్రామాయణ వైభవ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా ఈనెల 4వ తేదీ సాయంత్రం స్థానిక ప్రథమనందీశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ప్రముఖ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు వినిపిస్తారని, భక్తులు తరలిరావాలని మన ఊరు– మన గుడి, మన బాధ్యత నిర్వాహకులు శివకుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ప్రథమనందీశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో హిందువులతో ఓంకార మంత్రం జపించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో నంద్యాల పేరు నమోదు చేసే బృహత్తర కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నెరవాటి సత్యనారాయణ మాట్లాడుతూ నంద్యాల చరిత్రలో నిర్వహిస్తున్న అతి గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమని స్వచ్ఛంద సంస్థలు పాల్గొంచుకోవాలని కోరారు. యోగా గురువు దామోదర్‌రెడ్డి, గోళ్ల సుదర్శనం, గెలివి సహదేవుడు, తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలి

నంద్యాల(అర్బన్): బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం సరికాదని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ కోరారు. బోయ వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చేలా శాసనసభలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ శనివారం గిరిజన ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గిరిజనులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రవినాయక్, మల్లేనాయక్, ఓంకార్, రామచంద్రుడు, నాగార్జున పాల్గొన్నారు.

‘ఆసరా’తో మహిళలకు ఆర్థిక భరోసా



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): వైఎస్సార్ ఆసరా పథకం మహిళల ఆర్థిక భరోసా కల్పిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. శనివారం పట్టణంలో పలు వార్డుల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ హాజరై మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా స్థిరపడాలనే లక్ష్యంతో పథకాలను సీఎం జగనన్న అమలు చేస్తున్నారన్నారు. మాట ఇస్తే తప్పకుండా నెరవేర్చే నాయకుడు దేశంలో లేరని కొనియాడారు. మహిళలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని జీవనోపాధులను మరింత మెరుగుపరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో బెస్త సంఘం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గిరిబోయిన చంద్రశేఖర్, మెప్మా సీఎంఎం విజయభాస్కరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో ఇంటింటికీ మంచినీరు

పట్టణంలో ప్రతి ఇంటికీ త్వరలోనే సమయానుకూలంగా మంచినీరు అందిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా తెలిపారు. శనివారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డితో కలిసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన మోటార్ ట్యాంకులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కొద్ది రోజుల్లో ప్రతి ఇంటికీ నిర్ణీత సమయంలో నీరు సరఫరా చేస్తామని, మోటార్ పంపుల ద్వారా నీటిని పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. ఇటీవల కౌన్సిల్‌లో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి ఆదేశాల మేరకు నేడు మోటార్ పంపులను అమర్చి ట్రయల్ రన్ నిర్వహించామన్నారు. పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా నెలకొన్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మున్సిపల్ ఇంజనీర్ రమణమూర్తి, డీఈఈ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఉన్నారు.



మోటార్ పంపులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మాబున్నిసా

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకుందాం

నంద్యాల(అర్బన్): విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం రాకుండా కాపాడుకుందామని, ప్లాంట్ కార్మికులు 700 రోజులుగా చేస్తున్న పోరాటానికి ఏఐటీయూసీ అండగా ఉంటుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య తెలిపారు. విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు అంటూ కార్మికులు చేస్తున్న ఉద్యమానికి ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలుపుతూ శ్రీనివాస సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ, రైల్వేలు, ఓడరేవులు, హైవేలు, ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటుపరం చేస్తూ పేద బడుగు, బలహీన వర్గాలు బతికి బట్టకట్టలేని పరిస్థితిని సృష్టిస్తున్నారని మండిపడ్డారు. శివబాలకృష్ణ, ప్రసాద్, రమణారెడ్డి, శీలమ్మ, నాగేంద్రమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.